ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## పంజాబ్‌పై సన్‌రైజర్స్ విజయం

రెండో స్థానానికి హైదరాబాద్

4లో..

సంపుటి: 2 | సంచిక: 40 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 20 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# తెలంగాణ కేబినెట్ భేటీకి ఈసీ గ్రీన్ సిగ్నల్

### కానీ కండీషన్స్ అప్లై.. ఆ విషయాల జోలికి పోవొద్దు

తెలంగాణ మంత్రి వర్గ సమావేశానికి ఎట్టకేలకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. అది కూడా కండీషన్స్‌తో కూడిన అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలోని అత్యవసర పరిస్థితులపైనే చర్చించాలని కండీషన్ పెట్టింది. ఇక.. ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారు ఎవ్వరూ కూడా ఈ మీటింగ్‌కు హాజరుకాకూడదంటూ ఆదేశించింది. అంతే కాకుండా.. పలు విషయాలను ఈ సమావేశంలో అస్సలు ప్రస్తావించకూడదని మరీ మరీ ఈసీ ఆదేశించింది.





హైదరాబాద్, మే 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ కేబినెట్ భేటీకి కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే.. ఈ సమావేశానికి పలు షరతులు విధిస్తూ.. సీఈసీ అనుమతి ఇవ్వటం గమనార్హం. రాష్ట్రంలో సత్వరం పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయని, వాటి గురించి చర్చించేందుకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలన్న ఉద్దేశంతో.. లోక్ సభ ఎన్నికల పోలింగ్ పూర్తయిన వెంటనే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే.. కేబినెట్ భేటీ శనివారం (మే 18న) జరగాల్సి ఉండగా.. ఈసీ ఊహించని షాక్ ఇచ్చింది. ఎలక్షన్ కోడ్ ఇంకా ముగియలేదనే కారణంతో ఎన్నికల కమిషన్ కేబినెట్ భేటీకి అనుమతివ్వలేదు. అయితే.. కేబినెట్ సమావేశం ఆలస్యమయితే సమస్యల పరిష్కారం మరింత ఆలస్యమవుతుందని భావించిన రేవంత్ రెడ్డి సర్కారు.. ఈసీ అనుమతి కోసం అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఈసీ అనుమతి ఇవ్వకపోతే మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపించాలని రేవంత్ రెడ్డి భావించారు. అయితే.. ఈసీ అనుమతుల కోసం సోమవారం వరకు ఎదురుచూస్తామని, అప్పటికీ అనుమతి రాకపోతే మంత్రివర్గమే ఢిల్లీకి వెళ్లి ఈసీని కలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలోనే.. ఈసీ షరతులతో కూడిన కేబినెట్ భేటీకి అనుమతినివ్వటం గమనార్హం. అయితే.. ఈ మంత్రి వర్గ సమావేశంలో కేవలం అత్యవసర విషయాలనే చర్చించాలని ఈసీ కండీషన్ పెట్టింది. అంతేకాక.. ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు ఈ మీటింగ్‌లో పాల్గొనకూడదని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు.. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశాన్ని, రైతు రుణమాఫీ పథకాన్ని వాయిదా వేయాలని ఈసీ ఆదేశించింది. అయితే.. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా.. రైతు సంక్షేమం, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంట ప్రణాళిక, నిధుల సమీకరణ, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వంటి అంశాలపై చర్చించాలనుకున్నట్టు ప్రభుత్వం పెద్దలు చెప్తున్నారు. కాగా.. ఈసీ పెట్టిన షరతుల ప్రకారం వాళ్లు.. రైతు రుణ మాఫీపై చర్చించే అవకాశం లేకపోయింది. ఇక ఈ పథకం పట్టాలెక్కేది ఎన్నికల ఫలితాల తర్వాత. ఇదిలా ఉంటే.. రైతు రుణమాఫీని ఆగస్టు 15లోపు అమలు చేసి తీరతానని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రమంతా ప్రతిజ్ఞ చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే.



### రాయ్‌బరేలీలో రాహుల్ పోటీ..

## సోనియాపై ప్రధాని విమర్శలు

జంషెడ్‌పూర్, మే 19 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ కంచుకోటగా పేరొందిన రాయ్‌బరేలీ నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీకి దిగడంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తన కుమారుడి కోసం ఆ ప్రాంత ప్రజలను ఓట్లు అడిగిన సోనియా గాంధీపై విమర్శలు గుప్పించారు. జంషెడ్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. "సోనియా గాంధీ రాయ్‌బరేలీని వదిలి వెళ్లిపోయారు. కొవిడ్ తర్వాత ఆమె తన నియోజకవర్గాన్ని ఒక్కసారి కూడా సందర్శించలేదు. ప్రస్తుతం తన కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజల చేతుల్లో పెడుతున్నానంటూ.. ఓట్లు అడుగుతున్నారు. ఇక్కడ పోటీలో దింపడానికి ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ అభివృద్ధి కోసం పని చేసిన ఒక్క కార్యకర్త కూడా మీకు కనిపించలేదా? వారంతా (గాంధీ కుటుంబం) ఈ స్థానాన్ని తమ కుటుంబ ఆస్తిగా భావిస్తున్నారు" అని మోదీ విమర్శలు గుప్పించారు. వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. ఆ తర్వాత రాయ్‌బరేలీ నుంచి సిద్ధమవ్వడంపై ప్రధాని మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ యువరాజ్ (రాహుల్‌ను ఉద్దేశిస్తూ) వయనాడ్ నుంచి ఇప్పుడు రాయ్‌బరేలీకి పారిపోయారని ఎద్దేవా చేశారు. "స్కూలుకు వెళ్లే ఎనిమిదేళ్ల పిల్లాడు.. తన తండ్రి అక్కడ చదువుకున్నప్పటికీ.. అలా చెప్పుకోడు. రాయ్‌బరేలీ వెళ్లిన రాహుల్ మాత్రం ఇది తన తల్లిది అని చెబుతూ తిరుగుతున్నారు. ఈ కుటుంబ నేపథ్యం ఉన్నవారు ఎంపీ స్థానాలకు వీలునామా రాస్తున్నారు. ఇలాంటి కుటుంబ పార్టీల నుంచి ఝూరండ్‌ను కాపాడాలి" అని పిలుపునిచ్చారు.

## లోక్‌సభ ఎన్నికల ఐదవ దశ పోలింగ్

### ఎనిమిది రాష్ట్రాల్లోని 49 స్థానాలకు పోలింగ్

**అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 227 మంది కోటీశ్వరులైన అభ్యర్థులు**



న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల ఐదవ దశకు సోమవారం (మే 20) ఓటింగ్ జరగనుంది. ఈ దశలో ఎనిమిది రాష్ట్రాల్లోని 49 స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఐదో దశలో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో కోట్లాది ఆస్తులు ఉన్నట్లు ప్రకటించిన అభ్యర్థులు చాలా మంది ఉన్నారు. అలాంటి అభ్యర్థుల గురించి తెలుసుకుందాం.

**ఏ పార్టీలో ఎంత మంది కోటీశ్వరులు?**

ఐదో దశలో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. వీరిలో 227 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. ఐదో దశలో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తులు రూ.3.56 కోట్లు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మొత్తం 10 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. ఇది కాకుండా శివసేనకు చెందిన 6 మంది అభ్యర్థులు, ఆర్జేడీకి చెందిన నలుగురు అభ్యర్థులు కోటీశ్వరులు.

**పీయూష్ గోయల్:**

కేంద్ర మంత్రి, బీజేపీ నేత పీయూష్ గోయల్ ఈసారి ముంబై నార్త్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనకు రూ.110 కోట్ల ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన తొలిసారిగా ..మిగతా 2లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించండి: కేటీఆర్



హైదరాబాద్, మే 19 (ప్రభాత ఉదయం): 'నల్లగొండ-వరంగల్-ఖమ్మం' గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో గెలుపు మనదేనని, ఓటర్లు ఆలోచించి ఓటయ్యాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్నిసార్లూ గులాబీ పార్టీయే గెలుస్తూ వస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి స్వయంకృషితో పైకి వచ్చాడని, హైలీ ఎడ్యుకేటెడ్ వ్యక్తి అని చెప్పారు. ప్రధాని మోదీ అన్ని వర్గాలను మోసం చేస్తూ వస్తున్నడని, విభజన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ ..మిగతా 2లో



### యాదాద్రి భక్తులకు

## డ్రెస్ కోడ్ తప్పనిసరి

జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి.. 2



## పార్లమెంటు భద్రత

### రంగంలోకి 3300 మంది 'సీఐఎస్ఎఫ్' సిబ్బంది

న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం): పార్లమెంటు సమగ్ర భద్రత బాధ్యతలు ఇక పూర్తిస్థాయిలో 'సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ నిర్వహించనుంది. సీఐఎస్ఎఫ్ ఉగ్రవాద నిరోధక భద్రత విభాగానికి చెందిన 3300 మందికిపైగా సిబ్బంది సోమవారం (మే 20) నుంచి విధులు నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు సీఆర్పీఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్, ఢిల్లీ పోలీస్, పార్లమెంటు సెక్యూరిటీ స్టాఫ్‌లు పార్లమెంటు భవన సముదాయంలో ఉమ్మడిగా ఈ బాధ్యతలు నిర్వహించాయి. అలజడి ..మిగతా 2లో

# ఆదర్శ నేత సుందరయ్య: వెంకటస్వామి

**దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతకు ఘనమైన నివాళులు**

**నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యం సుందరయ్య : సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి.**



గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(ప్రభాత ఉదయం)దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యమైన ఆదర్శ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ధరూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... నేటి తరం రాజకీయ నాయకులు సుందరయ్య జీవితాన్ని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని రాజకీయ రంగంలో ఆదర్శవంతమైన నేతగా సుందరయ్య నిలిచారని ప్రజాప్రతినిధిగా సైకిల్ పై పార్లమెంటుకు వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్నారని తెలిపారు. 1913 సంవత్సరం మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడు లో జన్మించిన సుందరయ్య చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితుడై పేదల కోసం అలుపెరగని పోరాటం చేశాడని ధనిక కుటుంబంలో పుట్టి పెరిగినా జీవితాంతం కమ్యూనిస్టు ఆచరణతో ఉండటం ఆయన సొంతమని, ఆశయంపై అచంచల విశ్వాసంతో ఉంటూ ఎన్ని కష్టాలు వచ్చినా ఆ పరీక్షలకు తట్టుకొని పేద ప్రజల కోసం నిలబడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశంలో విప్లవ సాధనకు మార్గాన్ని వ్యూహాన్ని నిర్దేశించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పోరాడిన యోధుడు సుందరయ్య అని అన్నారు. కుల మతాలతో రాజకీయం చేస్తున్న నేటి సమాజంలో ప్రజాసేవకు కులం అడ్డు రాకూడదు అనే ఉద్దేశంతో సుందర రామిరెడ్డి అనే పేరును సుందరయ్యగా మార్చుకుని పేద ప్రజలతో మమేకమై పోరాటాలు నడిపిన పేదల బంధువు అని అన్నారు. రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, వ్యవసాయ కూలీల కు గిట్టుబాటు కూలి కోసం అనేక ఉద్యమాలు నడిపిన పోరాట యోధుడు అని తెలిపారు. 1985 మే 19వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య మరణించాడని భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన చూపిన మార్గంలో నేటి తరం కమ్యూనిస్టులు సుందరయ్య ఆశయాల సాధన కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాటాలు చేయాలని సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు నడపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధరూర్ మండల నాయకులు నరసింహులు, గోవిందు, చిన్న గోవిందు, దేవదాసు, తిమ్మప్ప, ఆంజనేయులు, మోష, దుబ్బన్న, రంగస్వామి, మునిసిపల్ యూనియన్ జిల్లా నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి భక్తులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి

యాదాద్రి, మే 18 (ప్రభాత ఉదయం): తెలంగాణలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఇకనుంచి డ్రెస్ కోడ్ తప్పనిసరి కానుంది. నరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని యాదగిరిగుట్ట దేవస్థానం నిర్ణయించింది. వివిధ సేవల్లో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించే నియమం జూన్ 1 నుంచి అమల్లోకి రానుంది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం తర్వాత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయంలో ఇప్పటికే ఆలయ ఈవోతోపాటు సిబ్బంది కూడా డ్రెస్ కోడ్‌ను పాటిస్తున్నారు. హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా చర్యలు చేపట్టాలని యాదగిరిగుట్ట దేవస్థానం నిర్ణయించింది. నిత్య కల్యాణం, హోమం, జోడు సేవలు, శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా నియమాన్ని అమలు చేయనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదాద్రిలో కూడా భక్తుల వీఐపీ బ్రేక్ దర్శనానికి డ్రెస్ కోడ్ తప్పనిసరి చేసింది. స్వామి వారి బ్రేక్ దర్శనానికి వచ్చే భక్తులకు తప్పనిసరిగా ఈ నిబంధన వర్తిస్తుందని, అదేవిధంగా సాధారణ ధర్మ దర్శనం క్యూలైన్‌లో వచ్చే భక్తులకు ఈ నియమం నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భాస్కర్ రావు తెలిపారు. ఆలయంలో జూన్ 1 నుంచి డ్రెస్ కోడ్ నియమాన్ని కచ్చితంగా అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఆలయంలో ఆధ్యాత్మికత, భక్తి భావాన్ని పెంచేందుకే ఇలాంటి నియమాలు అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు యాదాద్రీశుడి క్షేత్ర మహత్యం తెలిపేలా సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు, బోర్డులోనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఫోన్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో క్షేత్ర మహత్యం వివరాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఈవో భాస్కర్ రావు తెలిపారు. జూన్ 1వ నుంచి అమలయ్యే సంప్రదాయ వస్త్రధారణకు భక్తులందరూ సహకరించాలని ఆయన కోరారు.




## లోక్‌సభ ఎన్నికల ఐదవ దశ పోలింగ్

మొదటి పేజీ తరువాయి...

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భూషణ్ పాటిల్‌తో పీయూష్ గోయల్ తలపడుతున్నారు.

**అనురాగ్ శర్మ:**

ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ లోక్‌సభ స్థానం నుండి అనురాగ్ శర్మకు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. అతను శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన అఫిడవిట్ ప్రకారం మొత్తం ఆస్తులు రూ.212 కోట్లు. ఆయన చరాస్తుల విలువ రూ.95 కోట్లు కాగా, స్థిరాస్తుల విలువ రూ.116 కోట్లకు పైగా ఉంది.

**నీలేష్ భగవాన్ సాంబరే:**

మహారాష్ట్రలోని భివాండి లోక్‌సభ స్థానం నుంచి నీలేష్ భగవాన్ సాంబరే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సంభారే ఆస్తుల విలువ రూ.116 కోట్లు. ఇందులో రూ.32.7 కోట్ల విలువైన చరాస్తులు, సుమారు రూ.83.3 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి.

**సురేష్ గోపీనాథ్ మవాత్రే:**

ఎన్సీపీ (శరద్ పవార్) వర్గం భివాండి లోక్‌సభ స్థానం నుంచి సురేష్ గోపీనాథ్ మవాత్రేకు టికెట్ ఇచ్చింది. ఆయనకు రూ.107 కోట్ల ఆస్తులున్నాయి. అయితే, మవాత్రేకు కూడా 75 కోట్ల రూపాయల అప్పులు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

**కృష్ణ నంద్ త్రిపాఠి:**

జారండ్‌లోని చత్రా స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ కృష్ణ నంద్ త్రిపాఠీని బరిలోకి దింపింది. ఆయనకు 70 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు.

ADR ప్రకారం, 40 మంది బిజెపి అభ్యర్థులలో కనీసం 36 మంది తమ ఆస్తుల విలువ కోట్లను ప్రకటించారు. 18 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 15 మందికి కోటి రూపాయలకు పైగా ఆస్తులున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ఐదవ దశకు మే 20 (సోమవారం) పోలింగ్ జరగనుంది. ఈ దశలో 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 స్థానాలకు పోలింగ్ జరగనుంది.



## మరో ఐదురోజులు వానలే

హైదరాబాద్, మే 18 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రాగల ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఈ నెల 20న, 20న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాపాతం నమోదయ్యే ఉందని పేర్కొంది. అలాగే, 23న ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. వికారాబాద్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని టీఎస్‌డీపీఎస్ వివరించింది.

## పార్లమెంటు భద్రత

మొదటి పేజీ తరువాయి...

ఘటన నేపథ్యంలో..గతేడాది డిసెంబరులో శీతాకాల సమావేశాల సమయంలో పార్లమెంటులో అలజడి ఘటన తీవ్ర కలకలం రేపడంతో స్థానికంగా భద్రతపై అనేక సందేహాలు తలెత్తాయి. దీంతో కాంప్లెక్స్‌లో సమగ్ర భద్రత బాధ్యతలను సీఐఎస్‌ఎఫ్‌కు అప్పగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే పాత భద్రతా సిబ్బంది స్థానంలో 3317 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నారు. డీఐజీ ర్యాంకు స్థాయి సీఆర్పీఎఫ్ అధికారి శుక్రవారమే కాంప్లెక్స్‌లోని అన్ని సెక్యూరిటీ పాయింట్‌లను సీఐఎస్‌ఎఫ్‌కు అప్పగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**ప్రత్యేకంగా శిక్షణ అందించి..**

పార్లమెంటు కాంప్లెక్స్‌లోని అన్ని ప్రవేశ ద్వారాలు, అగ్నిమాపక విభాగం, సీసీటీవీ పర్యవేక్షణ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ సెంటర్, జాగిలాల స్క్వాడ్, వాచ్ టవర్‌ల వద్ద సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని నియమించారు. ఇప్పటికే వారికి సంబంధిత శిక్షణ అందజేశారు. విధ్వంసక కార్యకలాపాల కట్టడి తదితర విధులకు ప్రత్యేకంగా శిక్షణ పొందినవారిని రంగంలోకి దించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని మోహరించారని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి అనుమతులు వస్తాయని వెల్లడించాయి.

**అలజడి ఘటన.. పార్లమెంట్ భద్రతపై కేంద్రం కీలక నిర్ణయం..!**

గతేడాది డిసెంబరు 13న లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా.. ఇద్దరు దుండగులు విజిటర్స్ గ్యాలరీలో నుంచి సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. అదే సమయంలో పార్లమెంట్ భవనం వెలుపల ఇద్దరు వ్యక్తులు స్మోక్ క్యానిస్టర్లతో ఆందోళన చేశారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారందరినీ అదుపులోకి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా.. దాదాపు 1.70 లక్షల మంది సిబ్బందితో కూడిన 'సీఐఎస్‌ఎఫ్'.. కేంద్ర హోంశాఖ అధీనంలోని కేంద్ర సాయుధ పోలీసు దళం. దిల్లీలోని పలు కేంద్ర మంత్రిత్వ శాఖల భవనాలతోపాటు పౌర విమానాశ్రయాలు, అణుశక్తి, ఏరోస్పేస్ కేంద్రాలు, దిల్లీ మెట్రో వద్ద భద్రత కల్పిస్తోంది.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించండి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

అద్భుతంగా తీర్చిదిద్దారని కేటీఆర్ చెప్పారు. బీజేపీ వాళ్ళు గుడికట్టి ఓట్లడుగుతున్నారని, అలాగైతే మనం కూడా యాదాద్రి ఆలయం కట్టామని అన్నారు. కాళేశ్వరం లాంటి ఆధునిక ఆలయాన్ని కూడా కేసీఆర్ కట్టారని, ఆయన పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ 1 స్థానంలో నిలిచిందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండలో మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించామని గుర్తుచేశారు. చేసిన పని సరిగా చెప్పుకోలేక పోయామని, అందుకే ఓటమి పాలయ్యామని అన్నారు. మా పాలనలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని కేటీఆర్ తెలిపారు. రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తున్నదని విమర్శించారు. ఇవాళ తెలంగాణ ఆగమైందని, కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అన్నింటిని మర్చిపోయిందని అన్నారు. ప్రశ్నించే గొంతుక, ధిక్కార స్వరం అయిన రాకేష్ రెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ 30 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తే.. వాటి జాయినియంగ్ లెటర్లు పంచుతూ రేవంత్ రెడ్డి సొంత డబ్బా కొట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. మన అభ్యర్థి రాకేష్ రెడ్డి విద్యావంతుడని, ఆయన ప్రత్యర్థి పచ్చి బ్లాక్ మైలర్ అని, సొల్లు కబుర్లు చెప్పే మోసగాడని అన్నారు.

## హెలికాప్టర్ ప్రమాదానికి గురైన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ

**అజర్‌బైజాన్ సరిహద్దులో ఘోర ప్రమాదం..**



ఇరాన్, మే 18 (ప్రభాత ఉదయం): ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆదివారం (మే 19) ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదం తూర్పు అజర్‌బైజాన్‌లో జరిగింది, ఆ తర్వాత రెస్క్యూ టీమ్‌ను అక్కడికి పంపారు. ఇరాన్ అధ్యక్షుడి కాన్వాయ్‌లో మరో మూడు హెలికాప్టర్లు ఉన్నాయి. వాటిలో రెండింటిలో మంత్రులు, అధికారులు ప్రయాణిస్తున్నారు. వారంతా సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకున్నట్లు స్థానిక మీడియ పేర్కొంది. రాష్ట్రపతితో పాటు హెలికాప్టర్‌లో సయ్యద్ మొహమ్మద్–అలీ అల్–హషీమ్, తబ్రిజ్‌కు చెందిన జుమా, జమాత్, విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీరాబ్దుల్లాహియాన్ కూడా ఉన్నారు. ఇరాన్ మీడియా ప్రకారం, రాజధాని టెహ్రాన్‌కు వాయువ్యంగా 600 కిలోమీటర్ల (375 మైళ్ళు) దూరంలో అజర్‌బైజాన్ సరిహద్దులో ఉన్న జోల్ఫా నగరానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ఆదివారం అజర్‌బైజాన్‌లో ఒక డ్యామ్‌ను ప్రారంభించేందుకు అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్‌తో కలిసి వెళ్తున్నారు. అరస్ నదిపై ఇరు దేశాలు నిర్మించిన మూడో డ్యామ్ ఇది. మిడిల్ ఈస్ట్‌లో రోజురోజుకు ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనే వెలువడుతున్న తరుణంలో ఇది ఘటన జరిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక మీడియా ప్రకారం, రెస్క్యూ బృందాలు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా, రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకోలేకపోయాయి. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ఉన్న ప్రాంతంలో గాలులతో పాటు భారీ వర్షం, పొగమంచు కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. దీని వల్ల రాష్ట్రపతి విమానం హార్డ్ ల్యాండింగ్ అయ్యే అవకాశం కూడా ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలావుంటే, 2021లో ఇరాన్ అధ్యక్షుడిగా ఇబ్రహీం రైసీ విజయం సాధించారు.




## ముగియనున్న కవిత జ్యుడిషియల్ రిమాండ్

**కోర్టు నిర్ణయంపై తీవ్ర ఉత్కంఠ..!**

న్యూఢిల్లీ, మే 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ బ్యూరో: ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ, సీబీఐ తరపున ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు విధించిన జ్యుడిషియల్ రిమాండ్ సోమవారం ముగియనున్నది. దీంతో ఆమె రిమాండ్‌ను పొడిగించడంపై రౌస్ ఎవెన్యూ కోర్టు సోమవారం విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోనున్నది. స్పెషల్ జడ్జి కావేరీ బవేజా నేతృత్వంలో మధ్యాహ్నం రెండు గంటలకు విచారణ ప్రారంభం కానున్నది. కవితను ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు పర్చుడమా?... లేక వర్చువల్‌గా జైలు నుంచే విచారణకు హాజరు కానున్నారా?... అనే అంశంపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీనిపై సోమవారం ఉదయం స్పష్టత ఇవ్వనున్నారు. కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావడానికి కోర్టు గతంలోనే ఆమెకు వెసులుబాటు ఇచ్చింది. జ్యుడిషియల్ రిమాండ్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈడీ, సీబీఐ కేసుల్లో ఆమెకు రిమాండ్‌ను ఎన్ని రోజులు కోర్టు పొడిగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. సీబీఐ, ఈడీ కేసుల్లో ఢిల్లీ హైకోర్టులో కవిత దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై ఈ నెల 24న విచారణ జరగనున్న నేపథ్యంలో జ్యుడిషియల్ రిమాండ్ ఎప్పటివరకు విధిస్తారన్నది ఉత్కంఠగా మారింది. ఇదిలా ఉండగా ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు వ్యతిరేకంగా ఈడీ ఇటీవల దాఖలు చేసిన చార్జిషీట్‌ను కూడా స్పెషల్ జడ్జి పరిశీలించి పరిగణనలోకి తీసుకోవడంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈడీ తరపు వాదనలను విన్న తర్వాత క్లారిటీ రానున్నది.

## ఘనంగా బీసీఏ విద్యార్థుల ఫేర్ వెల్ పార్టీ



సైఫాబాద్ పీజీ కాలేజ్ లోని బీసీఏ డిపార్ట్ మెంట్ ఫేర్ వెల్ పార్టీలో పాల్గొన్న విద్యార్థులు



బీసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు

**చింతల్ బస్తీ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో సంబరాలు చేసుకున్న విద్యార్థులు**

హైదరాబాద్, మే19(ప్రభాత ఉదయం) : సైఫాబాద్ పీజీ కళాశాలలో బీసీఏ చదువుతున్న విద్యార్థులు ఆదివారం చింతల్ బస్తీ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. బీసీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్ వెల్ పార్టీ ఇచ్చారు.

**ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు :**

బీసీఏ విద్యార్థుల ఫేర్ వెల్ పార్టీ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, స్కిట్ లు, కవితలు, రాంప్ వాక్, డీజే సాంగ్స్ లతో ఆడి పాడారు.

# పెనుయేల్ ప్రార్థన మందిరంలో ప్రపంచ ప్రార్థన దినోత్సవం



హైదర్షాకోట్ హిమగిరి నగర్ లో గల పెనుయేల్ గాస్పెల్ చర్చ్ లో జరిగిన ప్రపంచ ప్రార్థన దినోత్సవం లో క్రైస్తవ ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తున్న రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మల్లా



బైబిల్ సందేశాలను వివరిస్తున్న నేషనల్ ప్రేయర్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ కె. వి. పాల్



ప్రార్థన లో పాల్గొన్న క్రైస్తవులు

బుద్వేల్, మే19(ప్రభాత ఉదయం) : గండిపేట్ మండలం హైదర్ షా కోట్ హిమగిరి నగర్ లో గల పెనుయేల్ గాస్పెల్ చర్చిలో ఆదివారం సాయంత్రం ప్రపంచ ప్రార్థనా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చర్చ్ పాస్టర్ జాషువా గుమ్మల్ల నేతృత్వంలో జరిగిన ఈ ప్రార్థనలో గండిపేట్, రాజేంద్రనగర్ మండలానికి చెందిన పాస్టర్లు వారి సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం, ప్రపంచం కోసం, ప్రపంచంలో ఉన్న క్రైస్తవ సంఘాల కోసం, నాయకులు, అధికారుల కోసం, న్యాయస్థానాలు ప్రసార మాధ్యమాలు, విశ్వాసుల కోసం , నీతివంతమైన పాలన కోసం ప్రార్థనలు చేశారు.

**బైబిల్ సందేశాలను అందజేసిన రెవరెండ్ డాక్టర్ కె వీ పాల్**

క్రైస్తవ సంఘాలు, విశ్వాసులు దేశం కోసం, నాయకుల కోసం, అధికారుల కోసం అనునిత్యం ప్రార్థించాలని నేషనల్ ప్రేయర్ మూవ్ మెంట్ వ్యవస్థాపకులు డాక్టర్ కె వి పాల్ తెలిపారు. బైబిల్ మంచిని బోధిస్తుందని, ప్రేమ, సంతోషం, ఐక్యత, సమన్యాయం ప్రజలందరి కీ అందించే విధంగా బైబిల్ లో భక్తులు రాయడం జరిగిందన్నారు.

**ప్రార్థనలు చేసిన పాస్టర్లు :**

ప్రపంచ ప్రార్థన దినోత్సవం సందర్భంగా పెనుయేల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ప్రార్థన లలో రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె. సుందర్ పాల్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఈ మనోహరం, కోశాధికారి రెవరెండ్ జే పీ పాల్, రెవరెండ్ సామ్యూల్ రాజ్, పాస్టర్ పాల్ దేవరాజ్ , పాస్టర్ బట్టు శ్రీకాంత్, పాస్టర్ ప్రనీత్, సిస్టర్ స్వర్ణ రాజారామ్, సిస్టర్ పద్మ మొయినాబాద్, గండిపేట్ , శంషాబాద్ మండల పాస్టర్లు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న తెలంగాణ దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కూర బాలరాజు

## తెలంగాణ దళిత దండు రాష్ట్ర కార్యదర్శిగా గుర్రంపల్లి ఉదయ్ కుమార్

రాజేంద్రనగర్,మే19(ప్రభాత ఉదయం) తెలంగాణ దళిత దండు రాష్ట్ర కార్యదర్శిగా రాజేంద్రనగర్ బస్తీకి చెందిన గుర్రంపల్లి ఉదయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గుర్రంపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ...దళితుల హక్కుల సాధన కొరకు పోరాడుతామన్నారు.దళితులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,దళితుల హక్కులు%-%సామాజిక న్యాయం కోసం అందరం కలిసి కలసికట్టుగా పోరాడుదామని ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు.75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు,అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని,రిజర్వేషన్లను అమలు చేయకుండా చూస్తోందన్నారు.లౌకిక రాజ్యాంగానికే ప్రమాదం పొంచి ఉందని, మన హక్కులను కాలరాస్తోందన్నారు.



## రాజేంద్రనగర్‌లో పలుచోట్ల వర్షం

రాజేంద్రనగర్, మే 19(ప్రభాత ఉదయం): నగర శివారు రాజేంద్రనగర్ నియోజవర్గంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదర్ గూడ,అత్తాపూర్, రాజేంద్రనగర్,డైరీఫార్మ్ చౌరస్తా,అరాంఘర్,మైలార్ దేవులపల్లి,శంషాబాద్ తో పాటు పలుచోట్ల జల్లులతో పాటు తేలికపాటి వర్షం కురిసింది.ఇదిలా ఉండగా..పొద్దంతా ఎండ దంచికొట్టగా..సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నగర శివారని నల్లటి మేఘాలు కమ్మేయడంతో ఒక్కసారిగా చల్లబడింది. పలుచోట్ల ఈదురుగాలులు వీచాయి.




## ధరూర్ మండల జెడ్‌పిహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### పిల్లలను భవిష్యత్ తరాలుగా తీర్చిదిద్దాలి

### మల్దకల్ మండల విద్యాధికారి సురేష్

ధరూర్,మే19(ప్రభాత ఉదయం) ధరూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఆదివారం 2022 - 2023 బ్యాచ్ ఆ స్కూల్లో చదివిన పూర్వవిద్యార్థులు సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఒకరికి ఒకరు సంతోషం పంచుకొని వాళ్ల కోరికల మేరకు అభిప్రాయాల మేరకు, వివిధ వృత్తిలో స్థిరపడి మంచి ఆయుష్షు ఆరోగ్యాలతో స్థిరపడినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంకా ముందు ముందు భవిష్యత్తులో పై స్థాయికి ఎదిగి పేరు ప్రతిష్టలు సంపాదించాలని గురువులు అన్నారు. మల్దకల్ మండల విద్యాధికారి జి.సురేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## కొత్తకోట ఆమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత ఖాత్న (సున్తీ) క్యాంప్

కొత్త కోట,మే19(ప్రభాత ఉదయం)కొత్తకోట ఆమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత ఖాత్న (సున్తీ) క్యాంప్ ఆదివారం క్యూ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. సంస్థ ప్రతినిధులు డాక్టర్ తౌఫిక్ ఇమామ్ , డాక్టర్ మహమ్మద్ ముజీబ్ , సిబ్బంది పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాలకు ఎంతో సహకరిస్తూ ఒక సున్తి చేయడానికి 5వేల రూపాయలు అవుతుందన్నారు. ఈ ఖర్చును అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ భరిస్తూ కులమతాలకు అతీతంగా 120 మంది పిల్లలకు 6 లక్షల సున్తీ ఖర్చు చేసిందన్నారు. అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం ఏ హఫీజ్ మాట్లాడుతూ... ట్రస్ట్ గత 20 సంవత్సరాల నుండి నిరుపేద లకు ఎడ్యుకేషన్ హెల్త్ మెడికల్ , వివాహాలకు సేవలు అందిస్తుందన్నారు. ట్రస్ట్ గత 20 సంవత్సరాల నుండి నిరుపేద లకు ఎడ్యుకేషన్ హెల్త్ మెడికల్ , వివాహాలకు సేవలు చేస్తూ వస్తుందిఅని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు మాజీ అమీనుల్, మేస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్లాతీఫ్ ,అబ్దుల్ గఫార్ ,ఫయాజ్ అలీ, జావీద్ అలీ ఎంతో కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఖాజి షఫీ ,ఆఫీస్ కమల్ రెహమాన్,ఖాద్రియ మస్జిద్ మౌలానా సలాం గారు ,మక్కా మసీద్ మౌలానా షబ్బీర్, అహ్మద్, రషీ ద్ , మదీనా మజీద్ మౌలానా , గౌరవ అధ్యక్షులు మాజీ అమీనుల్ మేస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్లాతీఫ్ ,అబ్దుల్ గఫార్ ,ఫయాజ్ అలీ, జావీద్ అలీ ఎంతో కృషి చేస్తారని చెప్పారు.



ఆత్మీయ సమ్మేళనం లో పూర్వ విద్యార్థులు

## జియాగూడలోని భారత అభ్యుదయ హైస్కూల్ 1995- 96 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మెహదీపట్నం, మే19(ప్రభాత ఉదయం) నగరంలోని జియాగూడ భారత అభ్యుదయ హై స్కూల్ 1995- 96 బ్యాచ్ కు చెందిన ఎస్ఎస్ సి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడపడమే కాకుండా చారిటీ కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత కూడ ఎంతో ఉత్సాహంగా మేము ఇప్పటికే విద్యార్థులం అంటూ ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు, పాఠశాల లోగోతో ప్రత్యేక మెమొంటోను అందించుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని మనోజ్, రామస్వామి, ప్రభాకర్, గజానంద్, ఆనంద్ తోపాటు సునీత మరికొందరు ముందుకు నడిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటం ఆగదు

### ఐజ అఖిల కమిటీ ఏకగ్రీవ తీర్మానం

"గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(నమస్తే ఉదయం) గద్వాల జిల్లా ఐజ పెద్దవాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గత నెల రోజులుగా ఐజ పెద్ద వాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి మరోసారి అఖిల పక్ష కమిటి సమావేశమైంది. ఈ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మాట్లాడుతూ అఖిలపక్ష కమిటీ ఆందోళన చేపట్టిన తర్వాత కరెంట్ పోల్స్ పాతడం జరిగిందని, అప్రోచ్ రోడ్డు పనులు చేయడానికి పూనుకున్నా వేగవంతంగా పూర్తి చేయకపోతే వానాకాలంలో వచ్చే సమస్యలపై సమావేశం జరిగింది . అధికారులపై, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకొస్తేనే పనులు జరుగుతున్నాయని, ఒత్తిడి తగ్గించరాదని, కమిటి అభిప్రాయ పడింది. అధికారులు, స్పందించకపోవడం వల్లే అఖిలపక్ష కమిటీ ఏర్పాటు అయిందని, ఈ అఖిలపక్ష కమిటీ ద్వారానే ప్రజల సమస్యలను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని, పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అయిజ బ్రిడ్జితో పాటు, అయిజలో డిగ్రీ కళాశాల, రెవిన్యూ డివిజన్ కోసం కృషి చేయాలని కమిటి అభిప్రాయ పడింది. ముఖ్యంగా పులికల్ రోడ్డు కొరకు కూడా పోరాడాలని అఖిల పక్ష కమిటి తీర్మానించింది.



## రాజేంద్రనగర్ మన్నా చర్చ్‌లో గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్



రాజేంద్రనగర్ మన్నా చర్చ్‌లో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్



ప్రార్థన లు చేస్తున్న పాస్టర్లు



రెవరెండ్ థామస్ కురియన్



జాతీయ పతాకంతో చిన్నారి



దేశం కోసం గీతాలాపన చేస్తున్న విశ్వాసులు

బుద్వేల్, మే19(ప్రభాత ఉదయం): మన్నా ఫుల్ గాస్పల్ చర్చిలో ఆదివారం సాయంత్రం గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ నిర్వహించారు. పెంతుకోస్తు పండుగ దినాన్ని పురస్కరించుకొని మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి.

**దేశం కోసం ప్రార్థించిన క్రైస్తవులు :**

దేశం కోసం , దేశంలో ఉన్న అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, న్యాయస్థానాలు , పోలీసులు, మీడియా, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రార్థనలు చేశారు.

**బైబిల్ సందేశాలు అందజేసిన రెవరెండ్ డాక్టర్ అబ్రహాం లింకన్**

ఏసుక్రీస్తు సజీవుడని, ఆయన మార్గంలో నడుచుకునే వారికి ఆయన సదా తోడుగా ఉంటారని రెవరెండ్ డాక్టర్ అబ్రహాం లింకన్ అన్నారు. ప్రార్థన చేయడం అంటే దేవునితో మాట్లాడమని తెలిపారు . ఆయన సజీవుడని తన శిష్యులకు కనపరచుకున్నాడని, నిరంతరం ఆయన మనతో ఉన్నాడని గుర్తు చేశారు.



రెవరెండ్ పి స్వర్ణ కుమార్



బైబిల్ సందేశాలను విస్తరిస్తున్న రెవరెండ్ డాక్టర్ అబ్రహాం లింకన్

**కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు :**

గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ లో రెవరెండ్ పి స్వర్ణకుమార్, రెవరెండ్ థామస్ కురియన్, పాస్టర్ వినోద్ తో పాటు పలువురు పాస్టర్లు పాల్గొన్నారు




ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# పంజాబ్‌పై సన్‌రైజర్స్ విజయం

## రెండో స్థానానికి హైదరాబాద్

**ఐపీఎల్ 2024లో లీగ్ స్టేజ్‌ను టాప్-2తో ముగించడమే లక్ష్యంగా సన్ రైజర్స్ హైదరాబాద్ ముందడుగు వేసింది. ఆదివారం జరిగిన తన చివరి లీగ్ దశ మ్యాచులో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. పంజాబ్ నిర్దేశించిన 215 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో పాయింట్ల పట్టికలో టాప్-2లోకి చేరింది.**



ఐపీఎల్ 2024లో భాగంగా.. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 214 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలోనే పూర్తి చేసింది. హైదరాబాద్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ షేక్ ఆడించాడు. 28 బంతుల్లో 66 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్ లో 6 సిక్సులు, 5 ఫోర్లు ఉన్నాయి. ఆ తర్వాత.. క్లాసెన్ (42) పరుగులు చేశాడు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి (37), రాహుల్ త్రిపాఠి (33) పరుగులతో రాణించారు. షాబాజ్ అహ్మద్ (3), అబ్దుల్ సమద్ (11బి), సన్వీర్ సింగ్ (6) పరుగులు చేసి విజయాన్ని అందించారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షల్ పటేల్ తలో 2 వికెట్లు సంపాదించారు. ఆ తర్వాత.. హర్‌ప్రీత్ బ్రార్, శశాంక్ సింగ్ తలో వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన పంజాబ్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటింగ్‌లో అత్యధికంగా ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (71) పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 సిక్సులు, 7 ఫోర్లు ఉన్నాయి. ఆ తర్వాత అథ్వారా థైడే (46), రిలీ రోసో (49) పరుగులతో రాణించారు. ఆ తర్వాత శశాంక్ సింగ్ (2), జితేష్ శర్మ (32బి), అశుతోష్ శర్మ (2), శివం సింగ్ (2బి) పరుగులు చేశారు. ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్‌లో నటరాజన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత కమిన్స్, విజయ్ కాంత్ వియస్కాంత్ తలో వికెట్ సాధించారు. కాగా.. ఎస్ఆర్‌హెచ్ ఈ మ్యాచ్ విజయంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

ఐపీఎల్ 2024లో 69వ మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పంజాబ్‌తో జరిగిన తన చివరి లీగ్ మ్యాచ్ ను కూడా విజయంతో ముగించింది. ఈ మ్యాచ్ లో హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి తన సునామీ బ్యాటింగ్ తో జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే, ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభం నుంచి అభిషేక్ శర్మ తన సునామీ బ్యాటింగ్ తో బౌలర్లను చెడుగుడు ఆడుకుంటున్నాడు. తన ధనాధన్ బ్యాటింగ్ తో ఫోర్లు, సిక్సర్లు బాదుతూ స్టేడియాన్ని షేక్ చేస్తున్నాడు. ప్రపంచ టాప్ బౌలర్లను తన బ్యాట్ తో భయపెడుతున్నాడు. ప్రపంచంలోని గొప్ప ఆల్ రౌండర్లలో ఒకరైన పాట్ కమిన్స్ ప్రస్తుతం హైదరాబాద్ టీమ్ ముందుకు నడిపిస్తున్నాడు. తన బౌలింగ్‌తో పెద్ద పెద్ద స్టార్ బ్యాట్స్‌మెన్లను వణికించాడు. తన పేస్ బౌలింగ్ తో స్టార్ బ్యాటర్లను మోకరిల్లేలా చేశాడు. కానీ ఐపీఎల్ 2024లో పాట్ కమిన్స్ తన సొంత జట్టు 23 ఏళ్ల ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటింగ్ చూసి షాక్ అయ్యాడు. ఈ సీజన్‌లో ఫోర్లు సిక్సర్లతో పరుగుల సునామీ సృష్టిస్తున్న అభిషేక్ శర్మ.. లీగ్ రౌండ్ చివరి మ్యాచ్ లోనూ తుఫాన్ బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు.

పంజాబ్ ఉంచిన 215 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు హైదరాబాద్ జట్టు బరిలోకి దిగింది. విధ్వంసానికి మారుపేరుగా ఉన్న ట్రావిస్ హెడ్ డకౌట్ తో షాక్ తగిలింది. కానీ అభిషేక్ శర్మ తన సునామీ బ్యాటింగ్ ను కొనసాగించాడు. అభిషేక్ కేవలం 28 బంతుల్లో 6 భారీ సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 66 పరుగుల ఇన్నింగ్స్‌ను ఆడాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అభిషేక్ శర్మకు ఇది మూడో అర్ధశతకం. 13 మ్యాచ్‌లు ఆడి 467 పరుగులు చేశాడు.

### పాట్ కమిన్స్ కామెంట్స్ వైరల్..

అభిషేక్ శర్మ సునామీ బ్యాటింగ్ ను చూసి పాట్ కమిన్స్ కూడా భయపడిపోయాడు. దీని గురించి మాట్లాడుతూ, "ఇది చాలా బాగుంది.. అద్భుతంగా ఉంది. ఇక్కడ 7 మ్యాచుల్లో 6 గెలిచి అద్భుతమైన క్రికెట్ ఆడాం. అభిషేక్ చాలా అద్భుతంగా ఆడుతున్నాడు. అభిషేక్ శర్మకు వ్యతిరేకంగా బౌలింగ్ చేయాలనుకోవడం లేదు.. అతనికి వ్యతిరేకంగా బౌలింగ్ చేయాలంటే భయంగా ఉంది. నితీష్ మంచి ఆటగాడు, వయసు కంటే మెచ్యూర్డ్ గా కనిపిస్తున్నాడు. అతను టాప్ ఆర్డర్‌కు పర్ఫెక్ట్" అని పేర్కొన్నాడు.

### చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

సీజన్ మొత్తం మీద అభిషేక్ అన్ని జట్లపై సిక్సర్ల మోత మోగించాడు. ఈ



క్రమంలోనే సరికొత్త రికార్డును నమోదుచేశాడు. ఈ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా ఘనత సాధించాడు. అలాగే, స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టాడు. ఐపీఎల్‌లో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా అభిషేక్ టాప్ లో ఉన్నాడు. ఇప్పటివరకు మొత్తం 41 సిక్సర్లు కొట్టాడు. అంతకుముందు ఈ రికార్డు 2016 ఐపీఎల్ సీజన్ లో 38 సిక్సర్లతో విరాట్ కోహ్లీ పేరిట ఉంది.



# రాజస్థాన్ వర్సెస్ కోల్‌కతా మ్యాచ్ రద్దు

### హైదరాబాద్‌కు కలిసొచ్చిన అదృష్టం


2024 సీజన్ లో భాగంగా ఆదివారం (మే 19) జరగాల్సిన రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ రద్దయింది . భారీ వర్షం కారణంగా గౌహతిలోని బుర్సపరా స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు ఒక్కో పాయింట్ లభించింది. కాగా ఈ మ్యాచ్ తో లీగ్ గేమ్స్ మొత్తం పూర్తయ్యాయి. పాయింట్ల పట్టికలో కేకేఆర్ జట్టు మొదటి స్థానంలో ఉంది. తద్వారా తొలి క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కేకేఆర్ జట్టు తలపడనుంది. మూడో స్థానంలో నిలిచిన రాజస్థాన్ రాయల్స్ జట్టు RCBతో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది. కాగా మ్యాచ్ ప్రారంభానికి ముందు నుంచే గువాహటిలో భారీ వర్షం కురిసింది. దీంతో కూడా టాస్ కూడా పడలేదు. అయితే ఎట్టకేలకు 10 గంటల తర్వాత వర్షం తగ్గడంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా మైదానాన్ని సిద్ధం చేశారు. మ్యాచ్ ను 7 ఓవర్ల కు కుదించారు. కోల్‌కతా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. 10:45 గంటలకు ప్రారంభించాలనుకున్నారు. కానీ, అంతలోనే మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.



# అలాంటి వ్యక్తి భర్తగా రావాలంటున్న చిట్టి

### ఫరియా అబ్దుల్లా క్రేజీ ఫోటోస్ వైరల్..

ఒకే ఒక్క తో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఫరియా అబ్దుల్లా. అనుదీప్ కేవి తెరకెక్కించిన జాతిరత్నాలు తో తెలుగు తెరకు పరిచమయైన ఫరియా.. మొదటి తోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇందులో తనదైన నటనతో అలరించింది ఫరియా. జాతిరత్నాలు తో చిట్టిగా గుర్తిండిపోయిన ఈ పొడుగు కాళ్ల సుందరి.. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించింది. రావణసుర, బంగార్రాజు వంటి చిత్రాలతో మెప్పించిన ఫరియా. ఒకే ఒక్కతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఫరియా అబ్దుల్లా. అనుదీప్ కేవి తెరకెక్కించిన జాతిరత్నాలు తో తెలుగు తెరకు పరిచమయైన ఫరియా.. మొదటి తోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇందులో తనదైన నటనతో అలరించింది ఫరియా. జాతిరత్నాలుతో చిట్టిగా గుర్తిండిపోయిన ఈ పొడుగు కాళ్ల సుందరి.. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించింది. రావణసుర, బంగార్రాజు వంటి చిత్రాలతో మెప్పించిన ఫరియా.. ఇటీవల ఆ ఒక్కటి అడక్కు తో మరోసారి ప్రేక్షకులను నవ్వించింది. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా తన కాబోయ భర్త ఎలా ఉండాలో రివీల్ చేసింది ఫరియా. యాపిల్ బాక్స్ అవసరం లేని వాడే కావాలంటూ ఫన్నీగా ఆన్సర్ ఇచ్చింది. అలాగే తనకంటే హైట్ తక్కువ ఉన్న పర్లేదు సకానీ సెన్సాఫ్ హ్యూమర్ మాత్రం ఉండాలంటుంది ఫరియా. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఫరియా తాజాగా షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. స్కై బ్లూ కలర్ నెట్ డ్రెస్ లో ఎంతో అంద గా కనిపిస్తుంది. ఫరియాకు డాన్స్ అంటే చాలా ఇష్టం . ఆమె బెల్లీ డాన్స్ కు చాలా మంది అభిమానులు ఉన్నారు. ఫరియా అబ్దుల్లా హైదరాబాద్ లో పుట్టి పెరిగింది. 2021లో జాతిరత్నాలు తో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది ఫరియా. ఆ తర్వాత సంతోష్ శోభన్ నటించిన లైక్ షేర్ అండ్ సబ్ స్క్రైబ్ చిత్రంలో నటించింది. ఫరియా తమిళంలోనూ ఓ చేస్తుంది.



# చెర్రీ ఆ మజాకా.!

### గురుశిష్యులకు రామ్ చరణ్ సమన్యాయం.!

ఓ వైపు గేమ్ ఛేంజర్ షూటింగ్ అయిపోనే లేదు.. అంతలోనే బుచ్చిబాబు ఓపెనింగ్ జరిగింది.. తర్వాత సుకుమార్ ను ప్రకటించారు రామ్ చరణ్. అసలీయన ప్లానింగ్ ఏంటి..? ఇంత బిజీలో ఇన్ని లను ఎప్పుడు పూర్తి చేస్తారు..? గురుశిష్యుల ల కోసం మెగా వారసుడు చేస్తున్న ప్లాన్ ఎలా ఉండబోతుంది..? గేమ్ ఛేంజర్ షూటింగ్ చివరిదశకు వచ్చింది. మరో వారం రోజుల్లోనే దీన్నుంచి బయటికి రాబోతున్నారు రామ్ చరణ్. ఓ వైపు గేమ్ ఛేంజర్ షూటింగ్ అయిపోనే లేదు.. అంతలోనే బుచ్చిబాబు ఓపెనింగ్ జరిగింది.. తర్వాత సుకుమార్ ను ప్రకటించారు రామ్ చరణ్. అసలీయన ప్లానింగ్ ఏంటి..? ఇంత బిజీలో ఇన్ని లను ఎప్పుడు పూర్తి చేస్తారు..? గురుశిష్యుల ల కోసం మెగా వారసుడు చేస్తున్న ప్లాన్ ఎలా ఉండబోతుంది..? గేమ్ ఛేంజర్ షూటింగ్ చివరిదశకు వచ్చింది. మరో వారం రోజుల్లోనే దీన్నుంచి బయటికి రాబోతున్నారు రామ్ చరణ్. అందుకే ఇకపై కాన్సన్ట్రేషన్ అంతా గురు శిష్యులపై పెట్టబోతున్నారు. అంటే బుచ్చిబాబు, సుకుమార్ ప్రాజెక్ట్స్ అన్నమాట. డిసెంబర్‌లో గేమ్ ఛేంజర్ విడుదలయ్యేలా ఉంది. ఇక జూన్ నుంచి బుచ్చిబాబు సెట్స్‌పైకి రానుంది. పైగా ఈ రెండింటినీ నిర్మిస్తుంది మైత్రి మూవీ మేకర్సే. కానీ అది చెప్పినంత ఈజీ అయితే కాదు. ఎందుకంటే గేమ్ ఛేంజర్ షూటింగ్ పూర్తైనా.. దాని ప్రమోషన్ కోసం టైమ్ కేటాయించాలి. మరోవైపు ఎంత వేగంగా పూర్తి చేసినా.. బుచ్చిబాబు ప్రాజెక్ట్ కనీసం ఏడాదైనా పడుతుంది. ఆ తర్వాతే సుకుమార్ సెట్స్‌పైకి వచ్చేది. పుష్ప 2 నుంచి సుకుమార్ ఫ్రీ అయ్యేలోపు.. బుచ్చిబాబు పూర్తి చేయాలనేది చరణ్ ప్లాన్. ఆల్రెడీ ప్రీ ప్రొడక్షన్ అయిపోయింది కాబట్టి.. ఆర్నెళ్లలోనే షూట్ పూర్తి చేయాలని చూస్తున్నారు బుచ్చి. అలా పూర్తైతే డిసెంబర్ నుంచి RC17 సెట్స్‌పైకి రానుంది. మొత్తానికి 2025 పూర్తయ్యేలోపు 3 లు చేయాలని చరణ్ ప్లాన్. కానీ అది వర్కవుట్ అయ్యేది మాత్రం దర్శకుల చేతిలోనే ఉంది.

# భయానికే భయం పుట్టించే దేవర



ఆదివారం ఈ చిత్ర టైటిల్ రోల్ని పరిచయం చేసే ఫియర్ సాంగ్ని చిత్ర బృందం రిలీజ్ చేసింది. అనిరుద్ రవిచంద్రన్ కంపోజ్ చేసిన ఈ పాట దేవరగా ఎన్టీఆర్ పాత్రలోని అన్ని కోణాలను పరిచయం చేసింది. అంతేకాదు భయానికే భయం పుట్టించేలా ఉన్న దేవర క్యారెక్టర్కి సర్వత్రా మంచి రెస్పాన్స్ వస్తోందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ నటిస్తున్న భారీ బడ్జెట్ సినిమా 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రపంచస్థాయిలో బజ్ క్రియేట్ చేస్తున్న సినిమా ఇది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈ చిత్రంలో హీరోయిన్గా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ హీరో సైఫ్ అలీ ఖాన్ కీ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఫస్ట్ పార్ట్ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళంలో చిత్రాన్ని అత్యంత భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాకు ఇప్పుడు బాలీవుడ్ నుంచి అద్భుతమైన సపోర్ట్ లభించింది. బాలీవుడ్ మేజర్ ప్లేయర్స్ ఈ చిత్రంతో చేతులు కలుపుతున్నారు. ధర్మ ప్రొడక్షన్స్, ఏఏ ఫిల్మ్స్ కలిసి ఈ సినిమాను ఉత్తరాదిన డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. ఈ చిత్ర నార్త్ థియేట్రికల్ రైట్స్ని కరణ్ జోహార్, అనిల్ తండానీ సొంతం చేసుకున్నారు. అత్యంత భారీ మొత్తం చెల్లించి ఈ మాగమ్ ఆపన్ని దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే విడుదలైన దేవర గ్లింప్స్ సోషల్ మీడియాలో సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. ఎన్టీఆర్ రోల్ మీద భీభత్సమైన ఇంట్రస్ట్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆయనతో పాటు ప్రకాష్రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరేన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో అద్భుతమైన క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ సమర్పిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఆర్. రత్నవేల్ సినిమాటోగ్రాఫర్గా, ప్రొడక్షన్ డిజైనర్గా సాబు సిరిల్ వ్యవహరిస్తున్నారు

# 'భారతీయుడు 2' రిలీజ్ డేట్ ఫిక్స్

### 'గుడ్ బ్యాడ్ అగ్లీ' లుక్‌తో అజిత్




కోలీవుడ్ ప్రముఖ హీరోలు కమల్ హాసన్, అజిత్ సినీ ప్రియులకు సర్‌ప్రైజ్‌లు ఇచ్చారు. తమ కొత్త చిత్రాల విడుదల అప్‌డేట్స్‌ని పంచుకున్నారు. కమల్- ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన హిట్ మూవీ 'భారతీయుడు' దానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందిన సంగతి తెలిసిందే. కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించారు. కొన్ని సంవత్సరాల క్రితమే ప్రారంభమైన ఈ సినిమా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చింది. జులై 12న ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు కమల్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తొలి పాటను ఈ నెల 22న రిలీజ్ చేయనున్నట్టు తెలిపారు. అజిత్ హీరోగా దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందిస్తున్న సినిమా 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సినిమాలోని అజిత్ లుక్‌ని టీమ్ విడుదల చేసింది. అందులో ఆయన కొత్తగా కనిపించారు. రెండు చేతుల నిండా టాటూలు, హెయిర్ స్టైల్‌తో ఆకట్టుకునేలా ఉన్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.